స్ట్రీట్‌లైట్స్ మరమ్మతులకు ప్రణాళికలు : రొనాల్డ్ రోస్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వీధి దీపాల నిర్వహణలో ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, సమస్యను సమర్థవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్ ఏజెన్సీలను ఆదేశించారు. సీడీఎంఏ కార్యాలయంలో గురువారం ఈఈఎస్‌ఎల్ ఏజెన్సీ అధికారులతో వీధిదీపాల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వీధిదీపాల మరమ్మతులను వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వీధి దీపాల నిర్వహణలో ఆరోపణలు, ఫిర్యాదులు వస్తే ఉపేక్షించమని కమిషనర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏజెన్సీ ప్రతినిధులు ఇంజనీర్ చీఫ్ జియాఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో పెరగనున్న ఏఐ వినియోగం


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వక్తలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రోగ నిర్ధారణ, చికిత్సల కోసం వైద్యరంగంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం నానాటికి పెరుగుతోందని ఏఐజీ ఆస్పత్రుల ఫౌండర్ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బయాలజీ, బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ రంగంలో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో భాగంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)లో గురువారం ప్రారంభమైన బయో అన్వేషణ 2024 సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. వైద్యరంగంలో ఏఐ వినియోగం కారణంగా రానున్న ఐదేళ్లలో పెను మార్పులు చోటు చేసుకుంటాయని తెలిపారు. కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ డాక్టర్ రాజేష్ ఎస్ గోఖలే, వర్సిటీ వీసీ ప్రొఫెసర్ బీజేరావు, హెచ్‌సీయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ హెడ్ ప్రొఫెసర్ జేఎస్‌ఎస్ ప్రకాష్‌తోపాటు, పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బసవతారకం ఆస్పత్రిలో 'యాక్ట్' క్లినిక్


'యాక్ట్' క్లినిక్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ పూర్ణ కుర్కురే తదితరులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ వ్యాధిని జయించిన సర్వైవర్స్ మున్ముందు ఇబ్బందులు ఎదుర్కోకుండా జీవితాన్ని సాఫీగా గడపడానికి యాక్ట్ (ఆఫ్టర్ కాంప్లిషన్ ఆఫ్ థెరపీ) క్లినిక్‌ను బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రి, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇంటర్నేషనల్ చైల్డ్ హుడ్ కేన్సర్ డే సందర్భంగా గురువారం ఇండియన్ కేన్సర్ సొసైటీ జాయింట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పూర్ణ కుర్కురే ఈ క్లినిక్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యరంగంలో ఆధునిక శాస్త్రీయ, సాంకేతిక విజ్ఞానం కారణంగా ఇప్పుడు కేన్సర్‌ను జయించిన వారి సంఖ్య పెరుగుతున్నదన్నారు. ఆస్పత్రి సీఈవో డాక్టర్ కె.కృష్ణయ్య మాట్లాడుతూ చికిత్స పూర్తి అయిన తర్వాత సాధారణ జీవనాన్ని సాగించడానికి అవసరమైన సలహాలు, సూచనలు, ఇతరత్రా ఇబ్బందులను దూరం చేయడానికి ఈ క్లినిక్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు ఎంవీటీ కృష్ణమోహన్, డాక్టర్ సెంథిల్ రాజప్ప, కల్పనా రఘునాథ్, వీరేంద్ర పాటిల్, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

కాంటినెంటల్ ఆస్పత్రిలో..


సెమినార్‌లో పాల్గొన్న వైద్యులు

రాయదుర్గం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ ఇమ్యూనో థెరపీ అపోహలను తొలగించడమే లక్ష్యంగా కాంటినెంటల్ ఆస్పత్రి పనిచేస్తుందని మెడికల్ ఆంకాలజిస్టు డాక్టర్ ఏవీఎస్ సురేష్ తెలిపారు. గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో గురువారం ఇమ్యూనో ఆంకాలజీలో అడ్వాన్స్ ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మసాచుసెట్స్ జనరల్ ఆస్పత్రి కేన్సర్ సెంటర్ క్లినికల్ డైరెక్టర్, హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లో ప్రొఫెసర్ డాక్టర్ కీత్‌ఫ్లాహెర్టీ మాట్లాడుతూ మిలనామ చికిత్స గురించి వివరించారు. ఈ సెమినార్‌లో ఇమ్యూనో థెరపీలో, క్లినికల్ డెవలప్‌మెంట్‌లో గుర్తింపు పొందిన డాక్టర్ రమీఇబ్రహీం, సీనియర్ అంకాలజిస్టు డాక్టర్ జగన్నాథ్, డాక్టర్ గురు ఎన్ రెడ్డి విశిష్ట పాల్గొన్నారు.

చిన్నారులపై లైంగిక వేధింపుల చిత్రాలు...

- సోషల్ మీడియాలో వైరల్ చేసిన యువకుడి అరెస్ట్


నిందితుడు జెమ్‌షెడ్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చిన్నారులపై లైంగికదాడులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, ఇతర నిషేధిత సమాచారాన్ని ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న వ్యక్తిని సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. సిటీ క్రైమ్స్ అండ్ సిట్ జాయింట్ సీపీ ఏవీ.రంగనాథ్ వివరాలు వెల్లడించారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన ఎస్‌కె.జమ్‌షెడ్ చిన్నారులపై లైంగిక దాడులకు సంబంధించిన సమాచారాన్ని సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్నట్లు సీబీడీ పోలీసులు గుర్తించారని తెలిపారు. తన పర్యవేక్షణలో డీసీపీ కవిత, ఏసీపీ శివమారుతి, ఇన్‌స్పెక్టర్ నరేష్ బృందం సాంకేతిక ఆధారాలు సేకరించి నిందితుడ్ని గుర్తించినట్లు తెలిపారు. పోలీస్ బృందం పశ్చిమబెంగాల్‌కు వెళ్లి నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

10 శాతం కమీషన్‌పై.. సైబర్ నేరగాళ్లకు బ్యాంకు అకౌంట్లు..

- చెన్నైకి చెందిన సైబర్ కిలేడీ ఆటకట్టించిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): 10 శాతం కమీషన్ తీసుకుంటూ.. సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు సమకూర్చుతూ.. అమాయకులను మోసం చేస్తున్న సైబర్ కిలేడీని సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. సైబర్ క్రైమ్ జాయింట్ సీపీ తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన బాధితుడు సైబర్ నేరగాళ్ల వలకు చిక్కి ఇన్వెస్టిమెంట్ పేరుతో రూ. 5.84లక్షలు పోగొట్టుకున్నాడు. దాంతో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన ఇన్‌స్పెక్టర్ నరేష్ టీమ్.. టెక్నికల్ ఎవిడెన్స్ సేకరించగా.. చెన్నైకి చెందిన ఒక బ్యాంకు ఖాతాలో బాధితుని డబ్బు జమయినట్లు గుర్తించారు. చెన్నైకి వెళ్లిన టీమ్ బ్యాంకు ఖాతా ఉన్న అడ్రస్‌లో ఆరా తీయగా.. సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపిన ఒక మహిళ తన పేరుతో బ్యాంకు ఖాతాలు తీసి 10 శాతం కమీషన్‌తో సైబర్ నేరగాళ్లకు అద్దెకు ఇస్తున్నట్లు తెలిసింది. టెలీగ్రామ్‌లో పరిచయం అయిన ఒక మహిళ ఆదేశాలతో ఇలాంటి మోసపూరితమైన పనులు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించి ఆమెను అరెస్టు చేసి నగరానికి తీసుకొచ్చి కటకటాల్లోకి నెట్టారు.

సమతామూర్తి చిట్‌ఫండ్ కేసులో కీలక సూత్రధారి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చిట్టీల పేరుతో ప్రజలను మోసం చేసిన సమతామూర్తి చిట్‌ఫండ్ కేసులో కీలక నిందితుడు సంస్థ అదనపు డైరెక్టర్ క్యాతం గణేష్(44)ను సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం అధికారులు అరెస్ట్ చేశారు. ఇల్లుల శ్రీనివాస్, అతడి కుమారుడు రాకేష్ వర్మ సమతామూర్తి చిట్‌ఫండ్‌ను ప్రారంభించారు. గతంలో చిట్‌ఫండ్ మోసాలు చేసిన క్యాతం గణేష్ అదనపు డైరెక్టర్‌గా ఇందులో చేరాడు. మోసపూరిత వాగ్దానాలతో 110మంది నుంచి రూ. 1.30 కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేశారు. వీరిపై పలువురు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం అధికారులు క్యాతం గణేష్‌ను గురువారం అరెస్ట్ చేశారు.

భూ వివాదం.. లాయర్, ఎమ్మెల్యేపై కేసు

(3వ పేజీ తరువాయి)

మ్యానేజ్ చేయాలని, అందుకు రూ. 10కోట్ల వరకు ఖర్చు అవుతుందని నమ్మబలికాడు. దాంతో సంఘం సభ్యులంతా డబ్బులు పోగేసి రూ. 7 కోట్లు వెంకటరమణకు ఇచ్చారు. ఇక మనం కేసు గెలిచినట్లేనని, మీరు స్వీట్లు పంచుకోవడానికి సిద్ధంగా ఉండాలని బాధితులను నమ్మించాడు. కానీ, అడ్వొకేట్ ఏనాడూ కేసును సీరియస్‌గా తీసుకోలేదు. అనుమానంతో అడ్వొకేట్ తీరుపై ఆరా తీయగా, ప్రత్యర్థుల నుంచి రూ.25 కోట్లు తీసుకొని వారికి సహకరిస్తున్నట్లు బాధితులు గుర్తించారు. తమ డబ్బు తిరిగి ఇవ్వాలని అతడిపై ఒత్తిడి చేశారు. రూ. కోటి తిరిగి ఇచ్చిన వెంకటరమణ మిగిలిన డబ్బులు ఇవ్వకుండా వారిని వేధిస్తున్నాడు. మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలను సంప్రదించి సంఘం నాయకుల నుంచి తనను బయటపడేయాలని మొరపెట్టుకున్నాడు. ఎమ్మెల్యే, అయన అనుచరులు సంఘం నాయకులపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. దాంతో వేదుల వెంకటరమణ, ఎమ్మెల్యే బలాల నుంచి తమ సంఘానికి, తమ కుటుంబాలకు ప్రాణహాని ఉందని బాధితులు సీసీఎస్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు న్యాయవాది, మలక్‌పేట ఎమ్మెల్యేపై కేసు నమోదు చేశారు.

చెరువుల అన్యాక్రాంతంపై ఫిర్యాదు

- పరిశీలించిన కమిషన్ సభ్యులు


దుర్గంచెరువును పరిశీలిస్తున్న కమిషన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు

గచ్చిబౌలి / అల్లాపూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యో తి): చెరువులు అన్యాక్రాంతమవుతున్నాయని ఫిర్యాదులు రావడంతో హైకోర్టు నియమించిన కమిషన్ సభ్యులు గురువారం శేరిలింగంపల్లి మండలంలోని మాదాపూర్ దుర్గంచెరువు, గుట్టలబేగంపేటలోని సున్నంచెరువు, నానక్‌రాంగూడలోని మేడికుంట, గౌలిదొడ్డిలోని గోసాయికుంట, నల్లగండ్లలోని పెద్దచెరు వు, చందానగర్‌లోని గంగారం పెద్ద చెరువుల ను పరిశీలించారు. త్వరలోనే హైకోర్టుకు నివేదిక సమర్పిస్తామని వారు తెలిపారు. వీరి వెంట సర్వే అండ్ ల్యాండ్ రికార్డు అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ రాములు, రాజేంద్రనగర్ మండలం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే వెంకటేష్, డిప్యూటీ తహసీల్దార్ శంకర్, జీహెచ్‌ఎంసీ, నీటిపారుదల శాఖ అధికారులు వంశీకృష్ణ, నళిని, బాల్‌రెడి, మాదాపూర్, గచ్చిబౌలి, చందానగర్ పోలీస్‌స్టేషన్లకు చెందిన అధికారులు ఉన్నారు. శేరిలింగంపల్లి, మేడ్చల్, మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో చెరువులు అన్యాక్రాంతమవుతున్నాయని ఫిర్యాదులు రావడంతో హైకోర్టు చీఫ్ జస్టిస్.. హైకోర్టు న్యాయవాది ప్రవీణ్‌కుమార్, పీపీశ్రీకాంత్‌రెడ్డితో కమిషన్‌ను ఏర్పాటుచేశారు.


నిర్మాణదారుడికి నోటీసులు అందజేస్తున్న మున్సిపల్ అధికారులు

అక్రమ షెడ్లు, నిర్మాణాలకు నోటీసులు

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా నిర్మిస్తున్న షెడ్లు, ఇంటి నిర్మాణదారులకు అధికారులు నోటీసులు అందజేస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని జయభేరి, పోచమ్మగడ్డ, కొంపల్లి, దూలపల్లి తదితర ప్రాంతాల్లో నిర్మిస్తున్న అక్రమ షెడ్లకు అధికారులు గురువారం నోటీసులు అందజేశారు. అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు స్థానికంగా వెల్లు వెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అధికారులు, ప్రజా ప్రతినిధులు వాటిని ప్రోత్సహిస్తూ, అందినకాడికి దండుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. నోటీలు ఇచ్చి ఊరుకుంటారా? లేక అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటారని అనే ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అక్రమ అనుమతులను రద్దు చేయాలి


చెరువు ఎఫ్‌టీఎల్‌ను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లోని సర్వేనెంబర్ 134లో ఉన్న ఎర్రకుంట చెరువు పూర్తిగా కబ్జాల మయంగా మారింది. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో మ్యాప్స్ కన్‌స్ట్రక్షన్‌కి హెచ్‌ఎండీఏ, మున్సిపల్ అధికారులు అక్రమ అనుమతులు ఇవ్వడంపై కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ బీజేపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ... అక్రమ అనుమతులు ఇవ్వడానికి బీఆర్‌ఎస్ నాయకులు ప్రత్యక్ష, పరోక్ష సహకారం, 2వ డివిజన్ కార్పొరేటర్ చిట్ల దివాకర్ భార్య పేరు మీద సర్వేనెంబరు 336లో రిజిస్ట్రేషన్ చేసుకొని, సర్వేనెంబరు 334, 335లో నిర్మాణ అనుమతులు పొందడంపై బీజేపీ నాయకులు చెరువు అక్రమాలను పరిశీలించి నిరసన వ్యక్తం చేశారు.

ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను ఆక్రమించుకొని పక్కనే ఉన్న సర్వేనెంబరు 48,49ను చూపిస్తూ ఇరిగేషన్ ఎన్‌ఓసీ లేకుండానే మ్యాప్స్ కన్‌స్ట్రస్ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తహసీల్దార్, బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధి, ఓ కార్పొరేటర్ వరకు పెద్ద మొత్తంలో ముడుపులు చెల్లించుకొని, చెరువు స్థలానికి నిర్మాణ అనుమతులు పొందారన్నారు. ఈ విషయమై 2023 ఏప్రిల్‌లోనే కలెక్టర్ నుంచి కమిషనర్ వరకు తాము ఫిర్యాదు చేశామని, అయినా అధికారులు కనీస చర్యలు తీసుకోక పోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. ఇప్పటికైనా మున్సిపల్, హెచ్చఎండీ అధికారులు స్పందించి, ఇచ్చిన అక్రమ అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్పొరేషన్ బీజేపీ సెక్రటరీ అరుణ్‌రావు, కిషన్ మోర్చ అధ్యక్షులు ప్రసాద్‌రాజ్, ఈశ్వర్‌రెడ్డి, ముఖేష్, కుమార్ గౌడ్, శ్రీనివాస్, నర్సింహ రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని ఆట స్థలంగా మార్చాలి

నిజాంపేట్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): బాచుపల్లి ప్రభుత్వ పాఠశాలకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలో హెచ్ ఎం డబ్ల్యూఎస్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ కోసం ప్రభుత్వం ఒక ఎకరం స్థలం కేటాయించింది. అందులో నిర్మాణ పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు ఎక్స్‌క వేటర్‌తో వచ్చారు. పరిస్థితిని గమనించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ స్థలం పాఠశాల విద్యార్థుల ఆట స్థలంగా వినియోగించుకుంటున్నామని, ఈ స్థలంలో వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ ఎలా కడతారని అడ్డుకున్నారు. అనుమతులు ఇచ్చిన అధికారులు వెంటనే రద్దు చేసుకొని విద్యార్థులకు ఉపయోగపడే ఈ స్థలాన్ని అభివృద్ధి చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. దీంతో నిర్మాణ పనులను నిలిపివేసి వెళ్లిపోయారు.


పనులను అడ్డుకుంటున్న విద్యార్థులు

అత్తింటి వేధింపులతో గృహిణి ఆత్మహత్య


అమరావతి(ఫైల్)

గాజులరామారం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): భర్త, అత్తామామల వేధింపులతో గృహిణి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గాజులరామారం బాలాజీ లే-అవుట్‌లో నివాసం ఉండే అభిలాష్‌తో 2019 నవంబర్ 22న కవ్వాడిగూడాకు చెందిన మహేశ్వరం అమరావతికి(30)వివాహ మైంది. కట్నకానుకల కింద పుట్టింటి వారు అమారావతికి 550 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు కేజీల వెండి, రూ. 10 లక్షలు నగదుతో పాటు హయత్ నగర్‌లోని రూ. 3కోట్లు విలువ చేసే ఫ్లాట్ ఇచ్చి పెళ్లి చేశారు. అప్పటి నుంచి వారి కాపురం కొంత కాలం సజీవుగా సాగింది. కరోనా సమయంలో అభిలాష్ కార్ల వ్యాపారంలో నష్టం వచ్చింది. దీంతో అప్పటి నుంచి భర్త అభిలాష్ భార్యని ఫ్లాట్ అమ్మి డబ్బులు తీసుకురావాలని వేధించడంతో అమరావతి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్య చేసుకున్న విషయం అమరావతి తల్లి దండ్రులకు భర్త ఫోన్ చేసి మీ కుమార్తె ఉరి వేసుకొందని, ఆస్పత్రికి తీసుకెళ్తున్నామని అభిలాష్ తెలియజేశాడు. హుటాహుటిన అమరావతి కుటుంబ సభ్యులు వచ్చే సరికి మృతిచెంది ఉండడంతో తీవ్ర సోక సముద్రంలో మునిగి పోయిన బంధువులు సూరారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఉరి వేసుకున్న గదిలో వెతుకగా సూసైడ్ నోట్ దొరికింది. ఈసూసైడ్ నోట్‌లో భర్త అత్తా మామల వేధింపుల తోనే చనిపోతున్నాని, అమరావతి పెంపుడుకుక్క, తన బాబును అనాథ ఆశ్రమానికి అప్పచెప్పాలని రాసి ఉందని ఎస్ఐ నారాయణ సింగ్ తెలిపారు. మృతురాలు తమ్ముడు దినేష్ బావ అభిలాష్, అత్త అనురాధ, మామ శ్రీశైలంపై కేసు నమోదు చేయాలని సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృత దేహాన్ని పోస్టుమా ర్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ప్రీ లాంచింగ్ ఆఫర్ పేరుతో బురిడీ

- రూ. 15 లక్షలు తీసుకుని మోసం
- ప్రజావాణి ఫిర్యాదుతో వెలుగులోకి..

పంజాగుట్ట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రీ లాంచింగ్ పేరుతో అధునాతన వసతులతో తక్కువ ధరకే అపార్ట్‌మెంట్ అంటూ ప్రచారం చేసి, ఓ ఉపాధ్యాయురాలు నుంచి సగం డబ్బులు వసూలు చేసింది ఓ రియల్ సంస్థ. రోజులు గడుస్తున్నా స్పందన లేకపోవడంతో ఆమె ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. అధికారుల ఆదేశాలు, సూచనల మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా నర్సాపూర్ మండలానికి చెందిన ఇల్లందుల చంద్రమణి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. స్వంత ఇంటి కోసం కొన్ని రోజులుగా చూస్తోంది. పంజాగుట్ట నాగార్జున సర్కిల్ ప్రాంతంలో ఉన్న భువన తేజ ఇన్ఫ్రాక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నగర శివారు దుండిగల్ ప్రాంతంలో గ్రీన్ మిత్ర, తులసి, భాగ్య నగర్ పేరుతో తక్కువ ధరకే అపార్ట్‌మెంట్‌లు కడుతున్నామని ఇచ్చిన ప్రకటనను చూసి 2020లో వారిని సంప్రదించింది. ప్రీ లాంచింగ్ పేరుతో తక్కువ ధరకే రూ. 30 లక్షలకే అపార్ట్ మెంట్‌లో ఫ్లాట్ విక్రయిస్తున్నామని, సంస్థ ఎండి చెక్క సుబ్రమణ్యం, సిబ్బంది ఆమెకు చెప్పారు. వారి మాటలు నమ్మిన చంద్రమణి 2020 డిసెంబర్‌లో అడ్వాన్స్‌గా రూ. 15 లక్షలు చెల్లించి ఫ్లాట్ బుక్ చేసుకుంది. రోజులు గడుస్తున్నా గడువు తీరినా ఆమెకు సదరు సంస్థ వారు ఫ్లాట్ ఇవ్వలేదు. దీంతో ఆమె కొద్ది రోజుల క్రితం ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదును అధికారులు నగర పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకొని వెళ్లారు. పంపించారు. ఆయన సూచనల మేరకు పంజాగుట్ట పోలీసులు భువన తేజ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఎండి చెక్కా సుబ్రమణ్యం మీద గురువారం చీటింగ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'నీచూపు చెప్పింది నాకు' ఆవిష్కరణ


పుస్తకావిష్కరణలో తనికెళ్ల భరణి, వీఎన్ ఆదిత్య, రచయిత హేమంత్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వర్థమాన రచయిత కొరటమద్ది హేమంత్ తొలి ప్రయత్నంలోనే ఏకబిగిన చదివించే కథనంతో, మానసిక తత్వ విశ్లేషాత్మకంగా నవలను రాశారని నటులు, దర్శకులు, రచయిత తనికెళ్ల భరణి ప్రశంసించారు. ఫినిక్స్ ఎరినాలో కొరటమద్ది హేమంత్ రచించిన 'నీచూపు చెప్పింది నాకు' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. రచయిత కొరటమద్ది హేమంత్ మాట్లాడుతూ పుస్తక రచనలో తొలి నుంచి సహకారమందించి, ప్రోత్సహించిన తనికెళ్ల భరణి, రచయిత ఆకెళ్ల రాఘవేంద్రలకు ధన్యవాదాలు తెలిపారు. చేంబోలు శ్రీరామ శాస్త్రి సభాధ్యక్షులు, ఆర్‌జే శేఖర్ బాషా వాఖ్యాతగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో దర్శకులు వీఎన్ ఆదిత్య, నటుడు దర్శకుడు అవసరాల శ్రీనివాస్, నటుడు నిర్మాత వంశీ చాగంటితోపాటు పలువురు పాల్గొన్నారు.

గృహసముదాయానికి శంకుస్థాపన


8వ బెటాలియన్‌లో సిబ్బంది గృహసముదాయానికి శంకుస్థాపన చేస్తున్న రాష్ట్ర అడిషనల్ డీసీపీ స్వాతిలక్రా

గచ్చిబౌలి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో సిబ్బంది కోసం రూ. 13కోట్లతో నిర్మించనున్న గృహసముదాయానికి రాష్ట్ర అడిషనల్ డీసీపీ స్వాతిలక్రా, ఐజీబీ రమేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్వాతిలక్రా మాట్లాడుతూ గృహసముదాయన్ని నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ సన్ని,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కానిస్టేబుల్ కుటుంబసభ్యులకు సాయం

- విరాళాలు సేకరించి 200 గజాల స్థలం కొనుగోలు
- దస్తావేజులు అందజేసిన సీపీ అవినాష్ మహంతి


యాదయ్య కుటుంబ సభ్యులకు స్థలం దస్తావేజులు అందజేస్తున్న సీపీ అవినాష్ మహంతి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ, గుండెపోటుతో మృతి చెందిన కానిస్టేబుల్ పర్వగల్ల యాదయ్య కుటుంబానికి పోలీసులు అండగా నిలిచారు. మాదాపూర్ పోలీసులతోపాటు 2011 బ్యాచ్‌కు చెందిన మూడు కమిషనరేట్లలో పనిచేస్తున్న పోలీసులు కలిసి రూ. 15లక్షల విరాళం సేకరించారు. సేకరించిన డబ్బుతో యాదయ్య ఇద్దరు పిల్లల పేరున శంషాబాద్ పెద్ద షాపూర్‌లో 200 గజాల ప్లాట్‌ను కొనుగోలు చేశారు. ఈ ప్లాట్ దస్తావేజులను గురువారం కమిషనరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీపీ అవినాష్ మహంతి యాదయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాదాపూర్ డీసీపీ డాక్టర్ జి.వినీత్, ఇన్‌స్పెక్టర్ మల్లేష్‌తో పాటు పలువురు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గోల్ఫ్ ఫైనల్లో ఏంజెల్స్ జట్టు


ఫైనల్ చేరిన గోల్ఫర్లు


హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్‌లో సమా ఏంజెల్స్ టీమ్ ఆల్ఫా జట్లు ఫైనల్ చేరాయి. గచ్చిబౌలిలోని గోల్ఫ్ కోర్స్‌లో జరిగిన ఈ పోటీల్లో తొలి సెమీస్‌లో సమా ఏంజెల్స్ 5-3తో డీఎస్‌ఆర్ జట్టును ఓడించింది. రెండో సెమీఫైనల్లో హైలాండర్స్-టీమ్ ఆల్ఫా జట్ల మధ్య పోరు 4-4తో సమమైంది. దీంతో విజేతను తేల్చేందుకు ప్లేఆఫ్స్‌ను నిర్వహించగా ఇందులో టీమ్ ఆల్ఫా 2-1తో నెగ్గింది. ఈ రెండు జట్ల మధ్య వచ్చే 23వ తేదీన థాయ్‌లాండ్‌లోని నికాంటి గోల్ఫ్ క్లబ్‌లో ఫైనల్ జరగనుంది.

గాయపడిన వృద్ధుడి మృతి

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కారు ప్రమాదంలో ఓ వృద్ధుడు గాయపడి నెల రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుండ్లపోచంపల్లి మున్సిపల్‌లోని ఎస్సీ బస్తీకి చెందిన జోగిళ్ల శివయ్య (55)గత నెల 16న ఇంటి ఎదుట కూర్చున్నాడు. కారును గమనించకుండా డ్రైవర్ వెనుకకు తీస్తుండగా తీవ్ర గాయాలైన శివయ్యను గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు 108లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసున దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి ఆత్మహత్య

జీడిమెట్ల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. జీడిమెట్ల పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... సంగారెడ్డి జిల్లా, మండలం నిజాంపేట్, జంబికుంట గ్రామానికి చెందిన బి.జానయ్య (52)బతుకు దెరువు కోసం వలస వచ్చి చింతల్ భగత్‌సింగ్‌నగర్‌లో 30 సంవత్సరాలుగా నివాసం ఉంటూ రామకృష్ణానగర్‌లో కట్టెల వ్యాపారం నిర్వహిస్తున్నారు. రోజుమాదిరి గానే కట్టెల దుఖాణానికి వెళ్లి బుధవారం రాత్రి ఇంటికి వచ్చాడు. మళ్లీ ఫోన్ రాగానే కట్టెల దుఖాణానికి వెళ్లి ఇంటికి రాలేదు. గురువారం కట్టెల దుఖాణంలోని రేకుల షెడ్డులో తాడుతో ఉరి వేసుకొని మృతి చెంది ఉండడాన్ని చూసిన స్థానికులు భార్య భూదేవమ్మకు ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న భూదేవమ్మ దుఖాణానికి వెళ్లి చూడగా భర్త మృతి చెంది ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందుకున్న పోలీసులు మృత దేహాన్ని కిందికి దించి పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


అదృశ్యమైన విద్యార్థులు

చందానగర్‌లో ఇద్దరు విద్యార్థుల అదృశ్యం

చందానగర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు అదృశ్యమయ్యారు. ఈ సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రీధర్ తెలిపిన ప్రకారం... బెల్ ఎంఐజీ ఎస్ఓఎస్ పునరావాస కేంద్రంలో ఉంటున్న యు.రాజేష్(17), బి.జగన్(14) బెల్‌లోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో రాజేష్ 9, జగన్ 8వ తరగతి చదువుతున్నారు. రోజూ పాఠశలకు వెళ్లి సాయం త్రం 5.30గంటలకు పునరావాస కేంద్రానికి వచ్చేవారు. 13న పాఠశాలకు వెళ్లి తిరిగి రాలేదు. స్నేహితుల, బంధువులను విచారించినా ఆచూకీ తెలియక పోవడంతో ఏఎస్ఓస్ పునరావాస కేంద్రం ఇన్‌చార్జి ఎం.విక్రమ్ చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

మందకొడిగా ఆస్తిపన్ను వసూళ్లు..

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మూసాపేట, కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో ఆస్తిపన్ను వసూళ్ల ప్రక్రియ మందకొడిగా సాగుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను వసూళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. వేలాదిమంది భవన యజమానులు పన్ను చెల్లించే విషయంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా కమర్షియల్ భవన యజమానుల నుంచి జీహెచ్‌ఎంసీకి రావాల్సిన కోట్ల బకాయిలు పెండింగ్‌లోనే ఉన్నాయి. మిగతా సర్కిళ్ల పరిధిలో మొండి బకాయిదారుల నుంచి పన్ను వసూలు చేసేందుకు అధికారులు నోటీసులు, వారెంట్‌లు జారీ చేస్తుండగా... కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలో మాత్రం అటువంటి ప్రక్రియ మందకొండిగా కొనసాగుతోంది. మార్చి 31వ తేదీ నాటికి పూర్తిస్థాయిలో పన్ను వసూలు చేయాలంటూ ఉన్నతాధికారులు ఇచ్చిన టార్గెట్‌ను స్థానిక అధికారులు చేరుకోవడం అనుమానంగా ఉంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో జీహెచ్‌ఎంసీలోని రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యవైఖరి పన్ను వసూళ్లపై తీవ్ర ప్రభావం చూపుతోందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఇదీ టార్గెట్

మూసాపేట సర్కిళ్ల పరిధిలో ఈ వార్షిక ఏడాదికి గాను రూ. 119 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 84 కోట్లు మాత్రమే వసూలు చేశారు. ఇంకా రూ. 35 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. కూకట్‌పల్లి సర్కిల్ పరిధి నుంచి రూ. 100 కోట్లు వసూలు చేయాలన్న టార్గెట్ ఉండగా... ఇప్పటివరకు రూ. 64.85 కోట్లు వసూలు చేశారు. ఇంకా రూ. 36.06 కోట్ల పన్ను వసూలు కాలేదు. పెండింగ్‌లో ఉన్న రూ. 71 కోట్లు వసూలు చేసేందుకు మరో నెలన్నర సమయం మాత్రమే ఉంది. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి రెవిన్యూ విభాగంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు, సిబ్బందిపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరముందని ప్రజలు అంటున్నారు.

టార్గెట్ చేరుకునేలా కృషి

గతేడాది కూకట్‌పల్లి సర్కిల్‌కు రూ. 80 కోట్లు టార్గెట్ ఇచ్చారు... కానీ ఈ వార్షిక ఏడాదికి గాను రూ. 100 కోట్లు టార్గెట్ విధించారు. ఉన్నతాధికారులు ఇచ్చిన టార్గెట్‌ను చేరుకొనేలా చర్యలు చేపట్టాం. మొండి బకాయిదారుల నుంచి పన్ను వసూలు చేసేందుకు వారెంట్‌లు జారీ చేస్తున్నాం. అయినప్పటికీ... పన్ను కట్టకపోతే భవనాలను సీజ్ చేస్తున్నాం. ఏదేమైనా మార్చి నెలలో పన్ను వసూలు అధికంగా ఉంటుంది కాబట్టి.. టార్గెట్‌ను చేరుకొనేలా కృషి చేస్తున్నాం.

- కృష్ణయ్య, ఉపకమిషనర్, కూకట్‌పల్లి సర్కిల్